క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదా బేగం

పెద్దపప్పూరు: కిశోరబాలికలు రక్తహీనతలకు గురికాకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సాజిదా బేగం సూచించారు. మంగళవారం మండలంలోని శింగనగుట్టపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఆమె కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మమ్మ, కోఆర్డినేటర్ పల్లవి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ ఢిల్లీశ్వరి

గుత్తి: ప్రతి ఒక్కరూ మరీ ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సీడీపీఓ ఢిల్లీశ్వరి సూచించారు. పట్టణంలోని దాసరి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆరోగ్యం–పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, ఆయాలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం



కిశోర బాలికలతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తాడిపత్రి అర్బన్: వ్యక్తిగత పరిశుభ్రత పట్ల కిశోర బాలికలకు అవగాహన తప్పని సరి అని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. సోమవారం పట్టణ పరిధిలోని టైలర్స్ కాలనీలోని 1,2,3, కేంద్రాలతో పాటు కమ్మవారి వీధి, నసరుద్దీన్ వీధిల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ మాట్లాడుతూ ఆహారం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై కిశోర బాలికలు శ్రద్ధ కనబరచాలన్నారు. అనంతరం పౌష్టికాహారం ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో సూపవర్‌వైజర్ బి.లక్ష్మీదేవి, ఎమ్మెస్కే జ్యోతిలత, అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లేశ్వరమ్మ, రాధ, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గుత్తిఅనంతపురంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

పెద్దవడుగూరు: రోజూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని గుత్తిఅనంతపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు పౌష్టికాహార లోపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహార లోపాలు తలెత్తితే రక్తహీనత ఏర్పడుతుందన్నారు. పిల్లల్లో ఐరన్, ప్రొటీన్ లోపాలు ఎక్కువవడం వలన కలిగే అనారోగ్యాలను గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, సిబ్బంది పాల్గొన్నారు.

నాగదేవతకు ప్రత్యేక పూజలు



పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో మంగళవారం పంచలింగ సహిత నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా నాగదేవత ప్రతిమను శోభాయానంగా అలంకరించారు. వేదపండితులు రామేశ్వరశర్మ, చంద్రాశర్మ, అనిల్ మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. వైశాఖమాసాన్ని పురస్కరించుకొని పంచామృత అభిషేకం, సుబ్రహ్మణ్య అష్టోత్తర శతనామావళి, పుష్ప అర్చన, నివేదన గావించారు. ఈసందర్భంగా భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈత సరదా.. కారాదు శాపం!

- స్విమ్మింగ్ పూల్‌లో జాగ్రత్తలు పాటించాలంటున్న శిక్షకులు
- నిర్లక్ష్యం పాటిస్తే వ్యాధులు తప్పవంటున్న వైద్యులు

ఈత సరదా పిల్లల ప్రాణాలు బలిగొంటోంది. వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు, యువకులు చెరువులు, బావుల్లోకి ఈతకు వెళ్తున్నారు. ఈత రాకపోయినా చాలామంది పిల్లలు నీళ్లలోకి దిగి ప్రమాదాలకు గురువుతున్నారు. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

మే 19న బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని చిక్కవడియార్ చెరువులో ఈతకు వెళ్లి ఇమామ్‌బాషా (12) అనే బాలుడు మృతి చెందాడు. ఈత సరదా బాలుడి ప్రాణాలు బలికొంది. అలాగే ఫిబ్రవరి 28న పెద్దపప్పూరు ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో దుస్తులు ఉతకడానికి వెళ్లిన రజక కాలనీకి చెందిన ఓబులేసు (70) నీట మునిగి మృతి చెందాడు. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలు చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.



మృతిచెందిన బాలుడు ఇమామ్‌బాషా (ఫైల్)



తాడిపత్రిలోని స్విమ్మింగ్ పూల్‌లో సందడి చేస్తున్న చిన్నారులు

తాడిపత్రి అర్బన్: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి చక్కనైన మార్గం స్విమ్మింగ్(ఈత). పట్టణ పరిసర ప్రాంతంలోని స్విమ్మింగ్ పూల్ ఈత నేర్చుకునేందుకు వచ్చే యువత, చిన్నారులతో కిటకిటలాడుతోంది. పట్టణానికింతటికి ఒకే ఒక స్విమ్మింగ్ పూల్ కావడంతో కిక్కిరిసిపోతోంది. ఎండ తీవ్రత పెరగడం, ఆరోగ్య పరిరక్షణ నేపథ్యంలో ఇటీవల కాలంలో స్విమ్మింగ్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఎండల ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు పల్లెల్లో చెరువులు, కుంటలను, కోనేర్లను ఆశ్రయిస్తుండగా...పట్టణాలు, నగరాల్లో స్విమ్మింగ్ పూల్స్‌ను ఆశ్రయిస్తుంటారు.

సందడే సందడి...

ఎండల తీవ్రత పెరగంతో స్విమ్మింగ్ పూల్స్‌కు వచ్చే ఔత్సాహికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చిన్నారులు జలకాలాటలతో సందడి నెలకొంటోంది. మహిళలకు సైతం వేర్వేరు సమయాల్లో శిక్షణ అందిస్తున్నారు. శరీరంలో అదనంగా పేరుకుపోయిన కొవ్వు కరగడంతోపాటు మధుమేహంతో బాధపడుతున్న వారికి ఈతతో ఉపశమనం కలుగుతుంది. ఒంటి నొప్పులు, కీళ్ల నొప్పులు, అలర్జీ వంటివి దూరమై రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు అదుపులో ఉంటాయి. చురుకుదనం పెరిగి జ్ఞాపకశక్తి మెండుగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యంతో పాటు శరీరాకృతిని సైతం మెరుగుపరిచేందుకు స్విమ్మింగ్ దోహదపడుతుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

స్విమ్మింగ్‌కు వచ్చేవారు సరైన జాగ్రత్తలుతీసుకోకపోతే చర్మవ్యాధులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సరైన మోతాదులో కెమికల్స్ లేకపోతే ముప్పు తప్పదని అంటున్నారు. ఈతకు వచ్చే వారి నుంచి తమకు చర్మవాద్యధులు, ఫిట్స్ లేవని వైద్యులు ధ్రువీకరించే పత్రం తీసుకొస్తేనే స్విమ్మింగ్ పూల్ లోపలికి అనుమతిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- ఈత కొట్టేముందు కొంత సేపు జాగింగ్ చేయడం మంచిది.
- శిక్షణకు వచ్చే వారిపై సిబ్బంది వ్యక్తిగతంగా ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి
- స్విమ్మింగ్ డ్రెస్, క్యాప్, గ్లాసెస్, ట్యూబ్‌లను తప్పనిసరిగా వినియోగించాలి. లేకపోతే కళ్లకు, జుట్టుకు ఇన్‌ఫెక్షన్ వచ్చే ఆస్కారం ఉంది.
- చెవిలోకి నీరు వెళ్తే ఫంగస్ ఏర్పడుతుంది. హియర్ ప్లగ్స్ వాడటం మంచింది.
- కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ పొంది తర్వాత నీటిలో ఈదటం, కూర్చోవడం వంటివి మెల్లమెల్లగా ప్రాక్టీస్ చేయాలి.
- కొలనులో నీరు తరచుగా మారుస్తుండాలి. స్వచ్ఛమైన నీటిలో మాత్రమే స్విమ్మింగ్ చేయాలి.
- నీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేకుండా చర్యలు తీసుకోవాలి.
- చర్మ, అంటువ్యాధులు ఉన్నవారిని వీలైనంత వరకు స్విమ్మింగ్ చేసేందుకు అనుమతించకూడదు.
- కెమికల్స్ తరచూ మారుస్తుండాలి. నీటిలో బ్లీచింగ్ పౌడర్ వేస్తుండాలి. అలా అని బ్లీచింగ్‌ను ఎక్కువగా వాడకూడదు.
- స్విమ్మింగ్ పూల్‌తోపాటు చెరువుల్లోనూ ఈత పూర్తయిన తర్వాత ప్రతి ఒక్కరూ మంచి నీళ్ళతో స్నానం చేయడం మంచింది.

ముమ్మరంగా వాహన తనిఖీ



దేవునిఉప్పలపాడు వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శరత్ చంద్ర

పెద్దపప్పూరు: మండల సరిహద్దులోని దేవునిఉప్పలపాడు, ముచ్చుకోట, చీమలవాగుపల్లి తదితర గ్రామాల వద్ద ఎస్ఐశరత్ చంద్ర మంగళవారం ముమ్మరంగా వాహనాల తనిఖీచేపట్టారు.ఆటోలు. ఇతర వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని డ్రైవర్లను హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు.

జీవాల లోడ్‌తో వ్యక్తి పరారీ..

పామిడి: అనంతపురం మార్కెట్‌యార్డుకు విక్రయానికి వెళ్లిన పామిడి మండల రైతుల జీవాల లోడ్‌తో ఓ యువకుడు పరారైన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలానికి చెందిన కొందరు రైతులు 150 గొర్రెలను విక్రయించేందుకు అనంతపురం మార్కెట్‌యార్డుకు గత శనివారం తీసుకెళ్లారు. అక్కడ శింగనమల మండలం ఇరువెందుల గ్రామవాసి, వ్యాపారి కృష్ణ మరుసటి రోజు డబ్బు చెల్లిస్తానంటూ నమ్మబలికి జీవాల లోడ్‌తో ఉడాయించాడు. రెండు రోజులైనా యువకుడు జీవాల డబ్బు చెల్లించకపోవడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ఈ వార్త వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది. జీవాల డబ్బు దాదాపు రూ.అరకోటి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘరానా మోసంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదిస్తే ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా జాబ్ అచీవర్స్ డే



విద్యార్థికి ఆఫర్ లెటర్లు అందజేస్తున్న దృశ్యం



కంప్యూటర్లు అందజేస్తున్న దాతలు

తాడిపత్రిటౌన్: ఆటో నగర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాబ్ అచీవర్స్ డే ఘనంగా నిర్వహించారు. కళాశాల నుంచి 58 మంది విద్యార్థులు అల్ట్రాటెక్, కల్పతరువు ప్రాజెక్ట్, రాయల్‌ఎన్‌ఫీల్డ్, ఆకృతి కన్స్ట్రక్షన్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్, ప్లేస్‌మెంట్ అచీవ్ ఆఫీసర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు. పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్య ద్వారా చిన్న వయస్సులోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలకు 35 కంప్యూటర్ల అందజేత

స్థానిక అర్జాస్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం పాలిటెక్నిక్ కళాశాలకు కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ పథకం ద్వారా 35 కంప్యూటర్‌లను వితరణ చేశారు. కళాశాల ప్రయోగశాలలో తగినన్ని కంప్యూటర్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్, అధ్యాపకులు తెలియజేడంతో స్పందించిన యాజమాన్యం కంప్యూటర్లు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ హెడ్ రాజేష్‌కుమార్ రంజన్, నరేందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

బుక్కరాయసముద్రం: కౌంటింగ్ రోజు గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బీకేఎస్ సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కేకే అగ్రహారం, సంజీవపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కౌంటింగ్ దృష్టిలో ఉంచుకుని ప్రజలు నిబంధనలు పాటించాలన్నారు. ఎవరైనా మద్యం సేవిస్తూ ర్యాలీలు, టపాసులు పేల్చడం వంటి కార్యక్రమాలు చేయరాదన్నారు. ఇప్పటి వరకూ మండలంలో 161 మందిని ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు.

దుప్పట్లు, బ్రెడ్డు పంపిణీ

గుంతకల్లు: పట్టణంలోని అనురాగ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం మల్లికార్జునరెడ్డి తన భార్య బసమ్మ జ్ఞాపకార్థం దుప్పట్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గార్లదిన్నె: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం కేశవాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు (43)కు భార్య జ్యోతి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న రామాంజనేయులు... కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేడు ఆలయ భూముల వేలం

వజ్రకరూరు: స్థానిక జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆలయ భూములు కౌలుకు ఇవ్వడానికి బుధవారం ఉదయం 11కు వేలం ఉంటుందని ఈఓ అంగదాల కృష్ణయ్య మంగళవారం తెలిపారు.

'మళ్లీ వైఎస్సార్‌సీపీదే హవా'

గుంతకల్లు: ఓటర్లు వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టారని, జూన్ 4న లెక్కింపులో ఇది బహిర్గతం కాబోతుందని, దీంతో వైఎస్సార్‌సీపీనే మరోసారి అధికారం చేపట్టబోతోందని బీసీ సంఘం అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమానంగా ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే జగనన్నకే సాధ్యమని గుర్తించిన ప్రజలు మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఆయనకు అండగా నిలిచారన్నారు. దాదాపు 170 అసెంబ్లీ, 24 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఇక తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో కనుమరుగువుతుందన్నారు.

2న గుండె వైద్య శిబిరం

గుంతకల్లుటౌన్: రెడ్ డ్రాప్ రక్తదాతల సంస్థ ఆధ్వర్యంలో జూన్ 3న ఉదయం పట్టణంలోని ఈద్గా మైదానంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు రెహమాన్, పట్టణ అధ్యక్షుడు గులామ్ మహమ్మద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు శిబిరంలో అనంతపురంలోని సవీరా ఆస్పత్రికి చెందిన వైద్యులు జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డీఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. వివరాలకు 96962 22666 నంబర్‌లో సంప్రదించాలన్నారు. వైద్య శిబిరాన్ని పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

40 మంది బైండోవర్

పామిడి: జూన్ 4న చేపట్టే కౌటింగ్‌ను పురస్కరించుకొని మంగళవారం అన్ని రాజకీయ పార్టీలకు చెందిన 40 మందిని పోలీసులు బైండోవర్ చేశారు. కౌటింగ్ తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా వారి అదుపులోనికి తీసుకున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ బెస్తరాజు సారథ్యంలో అదుపులోనికి తీసుకున్నవారిని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు.

ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని జిల్లా సైక్రియాట్రిస్ట్ నిపుణుడు డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రంలో ప్రపంచ స్కిజో ఫ్రినియా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వృత్తి ఏదైనా మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం చేయాలన్నారు. వంశపారంపరంగా, గర్భస్థ సమయంలో తల్లికి వైరల్ జ్వరాలు సోకడం, మత్తు పదార్థాలకు బానిస కావడం, చిన్న వయస్సులోనే లైంగిక, భౌతిక దాడులకు గురికావడం ఈ వ్యాధికి కారణమన్నారు. కులుంబ సభ్యులతో సఖ్యతగా లేకపోవడం, ముసలితనంలో వచ్చే మతి మరుపు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఇలాంటి సమస్య ఉన్నవారిని గ్రామాల్లో వైద్య సిబ్బంది గుర్తించాలన్నారు. డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, సీహెచ్‌ఓ మోహన్‌బాబు, శ్రీదేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణోత్సవం రద్దు'

తాడిపత్రి అర్బన్: స్థానిక శ్రీమార్కండేయ స్వామి ఆలయంలో జూన్ 1 వరకూ జరగవలసిన భద్రావతి భావనాఋషీశ్వరస్వామి కల్యాణోత్సవం కొన్ని అనివార్య కారణాల వల్ల ఆర్భాటంగా జరపడం లేదని బహుత్తమ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గడ్డం గణేష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా ఉత్సవాలను వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించేవారమని, ప్రస్తుతం ఈ నెల 30న ఆలయంలో నిరాడంబరంగా స్వామి కల్యాణత్సోవం మాత్రమే నిర్వహిస్తామన్నారు. పద్మశాలీయులు ఇళ్లలో గురువారం స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించుకోవాలని ప్రకటనలో కోరారు.

'నాణ్యమైన విత్తనాలందించాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రాయితీపై నాణ్యమైన వేరుశనగ విత్తనాలను అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నిర్మల, ఐద్వా నాయకురాలు రేణుక డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ భారతికి వారు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు అలసంద, మినుములు, పెసర, నువ్వులు, వేరుశనగ, కంది, ఆముదం, జొన్న తదితర విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా అందజేయాలన్నారు. జిల్లాలో గత ఏడాది 29 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించారని, పంటలు నష్టపోయిన రైతులకు బీమా సొమ్ము ఇప్పటి వరకూ అందలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున, కవిత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ

గార్లదిన్నె: ఉపాధి పథకం కింద డ్రైల్యాండ్ హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటల పెంపకం కోసం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పథకం కింద పండ్లతోటల పెంపకం కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ పథకానికి 5 ఎకరాలు లోపు ఉన్న రైతులు అర్హులన్నారు. చీనీ, మామిడి,జామ, సీతాఫలం, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, అల్ల నేరేడు, కొబ్బరి చెట్లు, తైవాన్ జామతో పాటు పూల జాతులకు సంబంధించి మల్లె, గులాబీతోటలు పెంపకం చేపట్టవచ్చన్నారు.

వీధి కుక్కలపై చర్యలు తీసుకుంటాం



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల సంఖ్య పెరగకుండా, పిచ్చి కుక్కల దాడి నుంచి ప్రజలను కాపాడడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుక్కలకు టీకాలు, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయిస్తామన్నారు. అంతే కాకుండా కుక్కల సంతతి ఉత్పత్తి కాకుండా యాంటీ బర్త్ కంట్రోల్ చేయిస్తామన్నారు. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడుతామన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

పెద్దపప్పూరు: మండలంలోని సుంకేసులపల్లి సమీపంలో అక్రమంగా ఇసుకలోడుతో వెలుతున్న టిప్పర్‌ను మంగళవారం పెద్దపప్పూరు ఎస్‌ఐ చరత్ చంద్ర వాహనాల తనిఖీల్లో బాగంగా సీజ్ చేసి కేసు నమోదు చేశారు. వివరాలు.. తాడిపత్రి మండలంలోని అలూరు గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది నుంచి యాడికి మండలానికి అడ్డదారిలో ఇసుకలోడుతో వెలుతున్న టిప్పర్ వాహనాన్ని ఎస్‌ఐ సీజ్ చేశారు. తాడిపత్రి మండలం కావేటిసముద్రం గ్రామానికి చెందిన డ్రైవర్ చెంచన్నను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ చంద్రకళ

శింగనమల: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో కుటుంబనియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకళ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మంగళవారం బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గురువారం ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. సీహెచ్‌సీలో ప్రతి శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తామన్నారు. సీహెచ్‌సీలో ప్రభుత్వం అనేక వైద్య సదుపాయాలు కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులూ.. నిర్లక్ష్యం వీడండి



మూలన పడేసిన రోడ్డు స్వీపింగ్ వెహికల్

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలను అందించడమే లక్ష్యంగా రూపొందించిన స్వచ్ఛభారత్–క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) కార్యక్రమాల అసలు లక్ష్యాలు మున్సిపల్ శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రోడ్లను శుభ్రం చేయడానికి స్వచ్ఛభారత్ కింద గుంతకల్లు మున్సిపాలిటీకి కేటాయించిన లక్షల రూపాయల విలువ చేసే 2 రోడ్డు స్వీపింగ్ వెహికల్స్‌ను అధికారులు మూలనపడేశారు. స్వీపింగ్ వెహికల్స్ వచ్చిన మూడు నెలలు పాటు పట్టణంలోని మెయిన్‌రోడ్డును శుభ్రం చేయడానికి వినియోగించారు. డ్రైవర్ల కొరత, రిపేర్లు, అరిగిపోయిన బ్రష్‌లు మార్చలేక, నిర్వహణ సక్రమంగా చేయని కారణంగానే ఆ వాహనాలు నిరుపయోగంగా మారాయి. వాహనాలకు సంబంధించిన పలు స్పేర్ పార్ట్‌లు తుప్పు పట్టి సేవ చేయకనే శిథిలమవుతున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు స్వీపింగ్ వెహికల్స్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రభుత్వ లక్ష్య సాధనకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'తో ఇంటి వద్దకే వైద్యం



చిక్కేపల్లెలో వైద సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీరాంకుమార్

యాడికి: ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు యాడికి ప్రభుత్వ వైద్యాధికారి శ్రీరామ్ కుమార్ తెలిపారు. మండలంలోని చిక్కేపల్లెలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన వివిధ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం మంచాన పడ్డ రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. వైద్య సిబ్బంది రామ్‌ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

పెద్దపప్పూరు: మండలంలోని కుమ్మెత చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను వేదపండితులు పార్థసారధిశర్మ, సుదర్శన శర్మ, చితంబర శర్మ ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.



హాజరైన భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం